సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరి

పథకాలు పొందేందుకు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. -8లో



ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీల్లో ఎలా నియమిస్తారు?

ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డు కమిటీల్లో ఎలా నియమిస్తారని ఇండియా కూటమి పార్టీల నేతలు డిమాండ్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

కల్యాణ వేదిక ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ

ఒంటిమిట్ట: ఏప్రిల్ 11న ఒంటిమిట్టలో జరగబోవు సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేయు సందర్భంగా కల్యాణ వేదిక ఏర్పాట్లను మంగళవారం కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం వచ్చే మార్గాన్ని, ఆయన ఆశీనులు అయ్యే ప్రదేశాన్ని, వీవీఐపీ గ్యాలరీలను, భక్తులు ప్రవేశించే మార్గాన్ని, ముత్యాల తలంబ్రాల కౌంటర్లను పరిశీలించారు.

పోలీస్ గస్తీ పర్యవేక్షణ

రాయచోటి: రాత్రివేళ నిర్వహిస్తున్న పోలీస్ గస్తీని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షించారు. మంగళవారం రాత్రి 11 గంటల అనంతరం జిల్లా ఎస్పీ రాయచోటి పట్టణ పరిధిలోని వీధులలో తిరిగారు. అర్బన్ సీఐ చలపతితో కలిసి పట్టణంలోని గస్తీని సమీక్షించి పట్టణంలోగల వివిధ ప్రదేశాలను సందర్శించారు. పట్టణంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి, దొంగతనాల నివారణకు చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ముఖ్యంగా అల్లరి మూకలు, అసాంఘిక కార్యక్రమాలను చేపట్టే వారిపట్ల అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని హెచ్చరించారు.

విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పుల్లంపేట: వెల్ఫేర్ అసిస్టెంట్‌లు విధులు సక్రమంగా నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్ అన్నారు. మంగళవారం బాలుర సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు సెలవుకు సంబంధించి సమాచారం ముందుగా సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభం రోజునే కిట్లు ఇవ్వాలి



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య

రాయచోటి టౌన్: పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు ఇవ్వాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ పెంచలయ్య జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభం రోజున విద్యార్థికి ఈ కిట్లు అందజేయడానికి ఏర్పాట్లు చేయా లని సూచించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూ సాక్స్, బెల్టు వంటి 9 రకాల వస్తువులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయ కర్త ఉలవల వెంకట్రామయ్య, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

వెలిగల్లు నుంచి రాయచోటికి తాగునీరు



చిన్నమండెంలో తారురోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం: రూ.450 కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి నియోజకవర్గానికి తాగునీరు అందిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం గొర్లముదివీడు క్రాస్ నుండి తూర్పుపల్లి వరకు కోటి రూపాయలతో నిర్మించిన తారురోడ్డును మంగళవారం మంత్రి ప్రారంభించారు.

మారుమూల గ్రామాలకు బస్సు సర్వీసులు

రాయచోటి అర్బన్: రాబోయే నాలుగేళ్లలో మరో 2వేల ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని శివాలయం సెంటర్‌లో ఆయన 12 నూతన బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 3 సూపర్ లగ్జరీ, 2 అల్ట్రా డీలక్స్ , 5 ఎక్స్‌ప్రెస్‌లు, 2 పల్లె వెలుగు సర్వీసులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్టీసీ డీఎం ధనుంజయ, ఆర్ఎం రాము, మదనపల్లె, పీలేరు, రాజంపేట డిపోల మేనేజర్‌లు, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకాసురులు

- ప్రకృతి సంపదను బొక్కేస్తున్న అధికార పార్టీ నేతలు
- ఉచితం మాటున అక్రమంగా ఇసుక తరలింపు
- ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు





ట్రాక్టర్ల నుంచి తరలిస్తున్న ఇసుక

సాక్షి ప్రతినిధి, కడప: కూటమి పాలనలో ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నాయి. టీడీపీ ప్రజాప్రతినిధుల అక్రమ ఆదాయ కోరల్లో చిక్కి నదులు శల్యమైతున్నాయి. ఉచిత ఇసుక మాటున లూటీ చేస్తున్నారు. పాపాఘ్ని, పెన్నా నదులను చెరబట్టారు. పేరుకే ప్రభుత్వ రీచ్‌లు, పక్కనున్న గ్రామాల నుంచి యథేచ్ఛగా మిషన్లు పెట్టి లోడింగ్ చేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. కమలాపురం, కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోయింది. అధికారిక ఇసుక రీచ్‌ల నుంచి కాకుండా పక్క గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఆదాయాన్ని బొక్కేస్తున్నారు.

ప్రధాన నగరాలకు తరలింపు

కమలాపురం, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల నుంచి ప్రధాన నగరాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. యంత్రాలతో లోడింగ్ చేసి, భారీ టిప్పర్లతో ఇసుక కన్పించకుండా పట్ట కట్టుకొని బెంగళూరు పట్టణానికి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నదుల్లో అధికారిక రీచ్‌ల్లో ఇసుక అలాగే కొనసాగిస్తూ.. ఆ మాటున పొరుగు గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఘటన కమలాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయం మైనింగ్‌శాఖలో పని చేస్తున్న చిరుద్యోగి నుంచి జిల్లా సర్వోన్నతాధికారి వరకూ అందరికీ తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం ఎమ్మెల్యేల కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండడమేనని పలువురు వివరిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా అక్రమార్కుల నుంచి నదులను రక్షించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

» నదులను చెరబట్టి..

ప్రకతి సంపద అధికార పార్టీ నేతల పాలిట కల్పతరువుగా మారింది. నదులు గుల్ల అవుతున్నాయి. యథేచ్ఛగా ఇసుక లూటీ కొనసాగిస్తున్నారు. అక్రమ సంపాదన కోసం పోటీ పడుతున్నారు. చిత్రావతి, పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. పొక్లెయిన్ల ద్వారా లోడింగ్ చేస్తూ భారీ టిప్పర్లతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. స్థానికంగా వినియోగదారుడికి ఇసుక కావాలంటే చుక్కలు చూడాల్సి వస్తోంది. 'ఉచిత ఇసుక' తెలుగు తమ్ముళ్లకు దోపిడీ పథకంగా తెరకెక్కింది. ప్రభుత్వ రీచ్‌లు దక్కించుకుని పొరుగున ఉన్న మరో గ్రామం నుంచి ఇసుకను బాహాటంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పైడికాల్వ, కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం, సంబటూరు ఇసుక రీచ్‌లు నిలుస్తున్నాయి. ప్రభుత్వ ఇసుక రీచ్ నిర్వహణను దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు ఆ మాటున అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇదే తంతు కొండాపురం, సిద్దవటం ప్రాంతాల్లో కూడా తెరపైకి వస్తోంది. అధికారిక రీచ్‌లే కాకుండా అనధికారిక రీచ్ నుంచి.. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పలువురు వాపోతున్నారు.



గొల్లపల్లె రీచ్‌లో టిప్పర్‌కు ఇసుక లోడింగ్ చేస్తున్న యంత్రాలు

యథేచ్ఛగా భూ కబ్జా

- దళితుల భూముల ఆక్రమణకు టీడీపీ నాయకుల యత్నం
- అడ్డుకున్న చిన్నంపల్లి దళితవాడ రైతులు



పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలో జేసీబీతో కబ్జాకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు



అడ్డుకున్న చిన్నంపల్లి దళితవాడ మహిళా రైతులు

ఓబులవారిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. మంగళవారం పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని చిన్నంపల్లి గ్రామ సమీపంలో యంత్రాలతో భూ కబ్జాలకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన దళితులు ఈ వ్యవహారాన్ని అడ్డుకున్నారు. 1998–99 సంవత్సరంలో సర్వే నెంబరు. 21 99–98లో చిన్నంపల్లి దళిత రైతులకు వ్యవసాయం చేసుకునేందుకు పట్టాలు ఇచ్చారు. పేద రైతులు భూమిసాగు చేసేందుకు డబ్బులు లేక చెట్లను తొలగిస్తూ వారి ఆధీనంలో ఉంచుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం పార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. తమ భూములు ఆక్రమించుకుంటున్నారని సోమ వారం దళిత రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా కూడా మంగళవారం సర్వే నెంబరు. 2202లో చిట్వేలి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు తన పేరుపై, తన బంధువుల పేరుపై ఆన్‌లైన్‌లో భూములు ఉన్నాయని జేసీబీలతో చదును చేసేందుకు కబ్జాకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న దళితవాడ రైతులు అడ్డుకున్నారు. చిట్వేలి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని తమ భూములు కబ్జా చేస్తున్నారని వారు తీవ్ర అభ్యంతరం చెప్పారు. కాగా ఈ విషయమై తహసీల్దార్ శ్రీధర్ రావును వివరణ కోరగా సర్వే నెంబరు. 2202 రికార్డు పరంగా ప్రభుత్వ భూమి అని ఈ నివేదికలు పంపిస్తామని, ఆన్‌లైన్ చేయించుకున్న వారికి నోటీసులు జారీచేస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకుల భూ కబ్జాలను అడ్డుకొని తమకు న్యాయం చేయాలని చిన్నంపల్లి దళితవాడ రైతులు రెవెన్యూ అధికారులను కోరారు.

కోదండ రామా.. నీలమేఘశ్యామా..

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. మూడో రోజు మంగళవారం రాత్రి సింహ వాహనంపై సీతాపతి ఊరేగారు. ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామి వారు పురవీధుల్లో విహరించారు. గ్రామోత్సవం అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలలో నేడు: బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు బుధవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో జగదభిరాముడు భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహిస్తారు. రాత్రి హనుమంత వాహన సేవ ఉంటుంది.



వటపత్రశాయి అలంకారంలో దర్శనమిస్తున్న కోదండరాముడు



విద్యుత్ దీప కాంతుల్లో వెలుగొందుతున్న ఒంటిమిట్ట రామాలయం

» సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు: టీటీడీ ఈఓ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు కడప జిల్లా యంత్రాంగం, టీటీడీ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈఓ జె. శ్యామలరావు వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలోని పరిపాలన భవనం సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి మీడియా సమావేశంలో ఈఓ మాట్లాడారు. సీతారాముల కల్యాణానికి చేపట్టిన ఏర్పాట్లను ఆయన వివరించారు. కల్యాణం సందర్భంగా ఏప్రిల్ 11న సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డు ప్రసాదం, కంకణం, అన్న ప్రసాదాలు అందజేస్తామన్నారు. ఆలయ సమీపంలో 3 వేల మంది భక్తులు వేచి ఉండేందుకు జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేలా 21 ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సారి ఆలయ ప్రాంగణంలో కళాకృతులతో సంక్షిప్త రామాయణాన్ని ఏర్పాటు చేశామని, 30 కళాబృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామన్నారు. 13 వైద్య శిబిరాలు, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 35 మంది వైద్య నిపుణులు, 8 అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. కల్యాణోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షించేందుకు హెచ్‌డీ క్వాలిటీతో ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం అందిస్తుందన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, కడప కలెక్టర్ శ్రీధర్

- కడప కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా కడప నుండి ఒంటిమిట్ట వరకు 85 బస్సులతో 425 ట్రిప్పులు, రాజంపేట నుండి ఒంటిమిట్ట వరకు 40 బస్సులతో మొత్తం 625 ట్రిప్పులు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కల్యాణ వేదిక ఆలయ పరిసరాలలో 250 మరుగుదొడ్లు నిర్వహిస్తున్నామన్నారు.
- కడప జిల్లా ఎస్పీ మాట్లాడుతూ టీటీడీ విజిలెన్సు విభాగం నుండి 350 మంది, జిల్లా పోలీస్ యంత్రాంగం నుండి 2500 మంది భద్రతా సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. 130 సిసి కెమెరాలు, 20 డ్రోన్లను ఏర్పాటు చేసి 4 ఫైర్ ఇంజన్లు, అత్యవసర సేవలందించేందుకు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.
- అంతకుముందు కల్యాణ వేదిక ప్రాంగణాన్ని జిల్లా, టీటీడీ అధికారులు పరిశీలించారు.

వినతులు సరే.. అమలే ప్రశ్నార్థకం

- సమస్యలు తీరి రైలు పట్టాలెక్కేనా.!
- ప్రతిపాదనలు సమావేశానికే పరిమితమా?
- డీఆర్‌యూసీసీ లక్ష్యాలను అధిగమించాలి
- నేడు గుంతకల్‌లో డీఆర్‌యూసీసీ సమావేశం



డీఆర్‌యూసీసీ సభ్యులు: 16
వేదిక : గుంతకల్ డీఆర్ఎం కాన్ఫరెన్స్ హాల్
సమయం: ఉదయం 11 గంటలు

రాజంపేట: రైలు ప్రయాణికుల సమస్యలపై డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులు ప్రతిసారి జరిగే సమావేశాలలో విన్నవించడం, ప్రస్తావించడం జరుగుతూనే ఉంది. అమలులో ఏమాత్రం కదలిక లేకుండా పోతోంది. ప్రతిపాదనలన్నీ సమావేశానికే పరిమితం అవుతూ వస్తున్నాయి. కాగా బుధవారం గుంతకల్‌లో డీఆర్‌యూసీసీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సారైనా విన్నవించే అంశాలు అమలుకు నోచుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- డివిజన్ కేంద్రమైన గుంతకల్ పరిధిలో ఉభయ వైఎస్సార్ జిల్లాలోని రైలుమార్గం ఉంది. ఈ మార్గంలో నిత్యం వేలాదిమంది రైళ్లలో ప్రయాణిస్తుంటారు. ప్రధానంగా రైళ్ల హాల్టింగ్స్ ఇప్పుడు ప్రయాణికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యగా కొనసాగుతోంది.

మొక్కుబడిగా సమావేశాలు..

నామినేటెడ్ కింద ఎంపీలు డీఆర్‌యూసీసీ పదవులకు పేర్లను ప్రతిపాదిస్తారు. వారే డీఆర్‌యూసీసీ సభ్యులుగా కొనసాగుతారు. డీఆర్‌యూసీసీ ఆవిర్భావం నుంచి రైల్వేబోర్డు నిబంధనల మేరకు సమావేశాలను నిర్వహిస్తున్నారు. డీఆర్‌యూసీసీ సభ్యులకు రానుపోను ఉచిత రైలు ప్రయాణంతోపాటు తదితర సౌకర్యాలను కల్పిస్తుంది. సభ్యుల వద్ద నుంచి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు స్వీకరిస్తుంటారు. ఈ సమావేశాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే అపవాదును రైల్వే మూటకట్టుకుంది.

గుంతకల్‌లో సమావేశం

డివిజన్ కేంద్రమైన గుంతకల్‌లో బుధవారం 156వ డీఆర్‌యూసీసీ సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు డీఆర్ఎం న్యూ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం జరుగుతుంది. ఈ మేరకు డీఆర్‌యూసీసీ సభ్యులకు సీనియర్ డీసీఎం మనోజ్ నుంచి ఆహ్వానాలు అందాయి.

డీఆర్‌యూసీసీ సభ్యులు వీరే...

ముత్యాల శివప్రసాద్, ఉదయ్‌కుమార్ యాదవ్, దినేష్ కుమార్ జైన్, ఎస్.రమేష్ బాబు, శ్రీనువాసులు, విజయకుమార్‌రెడ్డి, సహదేవరెడ్డి, అరవింద్‌కుమార్ ఎం.గాంధీ, రాజా వేణుగోపాల్ నాయక్, టీ.రవి డా.కృష్ణమూర్తి, రాజారెడ్డి, కోటిరెడ్డి, తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, తల్లెం భరత్ రెడ్డి, జున్న ప్రసాద్‌రెడ్డిలు నియమితులయ్యారు. కర్నూలు, అనంతపురం, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాలకు చెందినవారు.

» సమావేశానికే పరిమితమా?

డివిజన్ స్థాయిలో జరిగే డీఆర్‌యూసీసీ సమావేశంలో నియమితులైన సభ్యులు తమ తమ ప్రాంతాల పరిధిలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తారు. అవి పరిష్కరించాలని లేఖ ద్వారా ముందుగానే డివిజన్ రైల్వే అధికారులకు పంపిస్తారు. అయితే ఆ సమస్యలకు అనేక సాంకేతిక కారణాలను చూపి చేతులు దులుపుకోవడం కొనసాగుతున్న అనవాయితీ అనే విమర్శలు ఉన్నాయి. వినతులు సరే, వాటి అమలే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోంది.

ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలి



రైలు ప్రయాణికులు ఇప్పుడు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటన్నింటి గురించి సమావేశంలో ప్రస్తావించి పరిష్కరించే విధంగా అధికారులలో కదలిక తెప్పించాలి. రాజంపేట, నందలూరు, ఓబులవారిపల్లె లాంటి రైల్వేస్టేషన్లలో అన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలి.
-కేఎంఎల్ నరసింహా, న్యాయవాది, రాజంపేట

ప్రయాణికుల సమస్యలివే..

- రాష్ట్ర అధికారిక రామాలయం ఉన్న ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలి. తిరుమల, వెంకటాద్రి, రాయలసీమ, గుంటూరు, చెన్నై రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. ఇటీవల ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కూడా ఒంటిమిట్టలో రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని రైల్వేబోర్డును కోరిన సంగతి తెలిసిందే.
- ఇంటర్ సిటీ, నంద్యాల డెమోకు బోగీలు అదనంగా పెంచాలి. బోగీల రద్దీతో ప్రయాణికులు నానా కష్టాలు పడుతున్నారు.
- రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వే కేంద్రంలో కోవిడ్–19 ముందు అన్ని రైళ్లకు హాల్టింగ్ కొనసాగింది. ఇప్పుడు కేవలం ప్యాసింజర్ రైళ్లు, హరిప్రియ, తిరుమల రైళ్ల మాత్రమే ఆగుతున్నాయి. వెంకటాద్రి, చెన్నై–ముంబాయి మధ్య నడిచే రైళ్ల హాల్టింగ్ ఎత్తివేశారు. కోవిడ్ ముందు ఏవిధంగా హాల్టింగ్ ఉందో అదే విధంగా హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని ఎప్పటి నుంచో ఎంపీలతోపాటు డీఆర్‌యసీసీ సభ్యులు రైల్వేశాఖను కోరుతున్నారు.
- నందలూరు నీళ్లకు ఉన్న నాణ్యతను బట్టి రైళ్లకు వాటరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కోవిడ్–19 ముందు రూ.30లక్షల వ్యయంతో వాటరింగ్ నిర్మితం చేయాలని సర్వే కూడా చేశారు. ఆ తర్వాత కోవిడ్ ప్రభావంతో అటకెక్కించేశారు. ఈ వాటరింగ్ సెంటర్ వుండటం వల్ల తిరుపతి, రేణిగుంటపై భారం తగ్గుతుంది. ఇదే విషయాన్ని రాజ్యసభలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ప్రస్తావించిన సంగతి విదితమే.
- జిల్లా మీదుగా మరో ప్యాసింజర్ రైలును నడిపించాలని కోరుతున్నారు.
- తిరుపతి –షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలును డైలీ తిప్పాలని, బెంగళూరుకు వెళ్లేందుకు తిరుపతి వరకు నడుస్తున్న రైళ్లలో ఏదో ఒకటిని కడప వరకు పొడిగిస్తే జిల్లా వాసులకు బెంగళూరుకు వెళ్లేందుకు సులభతరమవుతుందని ప్రయాణికులు కోరుతున్నారు.
- దేశ రాజధాని రైలు కేవలం కడపలో ఆగుతోందని, రాజంపేటలో కూడా ఆపాలని దశాబ్దాలుగా ఎంపీలు కోరుతూ వచ్చారు. ఇటీవల రైల్వేబోర్డు అనుమతి ఇచ్చింది. అయితే అమలు ఇప్పుడు ప్రశ్నార్థకరంగా మారింది.
- ఆర్‌యూబీలను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే నందలూరు ఆర్‌యూబీ నిర్మాణం వల్ల అనేక అభ్యంతరాలు వస్తున్నాయని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- వేసవిలో అనేక రైళ్లలో నీటి సమస్యను ప్రయాణికులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.
- గుంటూరు–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను రాష్ట్ర రాజధాని అమరావతి వరకు పొడిగించాలనే డిమాండ్ ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది.
- ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం రైలుమార్గంలో ప్యాసింజర్ రైలును నడిపించాలని, కడప–విజయవాడకు ఉదయం పూట నడిచే విధంగా రైలును వేయాలని, లేని పక్షంలో గూడూరు జంక్షన్ వరకు అయితే డెమో రైలును నడిపించాలని చిరకాలంగా జిల్లా వాసులు కోరుతున్నారు. నెల్లూరు–కడప మధ్య రైలు జర్నీ లేదు. ఈ మార్గంలో రైళ్లను నడిపిస్తే నెల్లూరు–కడప మధ్య రాకపోకలు పెరుగుతాయి. ఇది వ్యాపార, రైతు, విద్యార్థి పరంగా ఉపయోగకరమని కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన రమేష్

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... బి.కొత్తకోట మండలం ఎగువ శీతివారిపల్లెకు చెందిన రమేష్(23) పనుల మీద బురకాయలకోటకు ద్విచక్రవాహనంలో వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా బురకాయలకోట బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న కోటీశ్వర్‌రెడ్డి ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో రమేష్‌కి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరదయ్యగారిపల్లి ఆలయంలో చోరీ



సీసీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యం

రాజంపేట : మండలంలోని వరదయ్యగారిపల్లి అక్కమ్మతల్లి ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం ఈ విషయాన్ని మన్నూరు సీఐ కులాయప్ప తెలిపారు. హుండీలు పగులకొట్టి అందులో నగదును తీసుకెళ్లిన దృశ్యాలను సీసీ పుటేజ్ ఆధారంగా రికార్డు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్ టీమ్ కూడా ఆలయాన్ని పరిశీలించిందన్నారు.

మందుల కోసం వచ్చాడు.. బంగారు చైన్ లాక్కెళ్లాడు

ప్రొద్దుటూరు క్రైం : వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలే బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని హోమస్‌పేటలో సుభాషిణి అనే 70 ఏళ్ల వృద్ధురాలు కొన్నేళ్లుగా ఆయుర్వేద మందులను తయారు చేసి విక్రయిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం మందులు తీసుకునేందుకు గుర్తు తెలియని భార్యాభర్తలు అక్కడికి వచ్చారు. భార్య బయట ఉండగా భర్త లోపలికి వెళ్లాడు. తన భార్యకు ఆరోగ్య సమస్య ఉందని మందులు ఇవ్వమని అడిగాడు. ఆమె మందులు ఇచ్చే క్రమంలో మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని ఆమెను తోసేశాడు. దీంతో ఆమె కింద పడిపోయింది. దొంగ అక్కడి నుంచి బయటికి పరుగెత్తి భార్యతో కలిసి ఆటోలో పారిపోయాడు.

వంట.. మంట!

- గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో 5.16 లక్షల గ్యాస్ కనెక్షన్లు
- గ్యాస్ వినియోగదారులపై సుమారు 2.68 కోట్ల అదనపు భారం



సాక్షి, రాయచోటి : పేద, మధ్య తరగతి ప్రజలకు వంట మంటగా మారింది.. ఇప్పటికే వంట గ్యాస్ భారంగా భరిస్తున్న ప్రజలకు అదనపు భారం మరింత సమస్యలను తెచ్చిపెడుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత గ్యాస్ అంటూ ఊదరగొట్టినా... అనేక ఆంక్షలతో ఉచిత గ్యాస్ అందకుండా పోతోంది. ఇలాంటి తరుణంలోనే అధికారంలో ఉన్న కేంద్రం మరొక మారు గ్యాస్‌పై భారం మోపడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 16 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్‌దారులపై భారం పడనుంది. కూలీ నాలీ చేసుకుని బతికే పేద ప్రజలు మాత్రం పెంపుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ కనెక్షన్‌పై రూ.50 పెంపు

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులపై భారం మోపింది. ఒక్కొక్క గ్యాస్ సిలిండర్‌పై అదనంగా ప్రస్తుతం ఇస్తున్న ధర‌పై రూ.50 పెంచడంతో వినియోగదారులు కష్టంగా భావిస్తున్నారు. దీపం, ఉజ్వల, పీఎస్ఆర్ గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,16,889 వివిధ పంపిణీలకు సంబంధించి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో ప్రస్తుతం రూ.803 ఉన్న సిలిండర్ ధర ఇప్పటి నుంచి రూ.853లుగా పెరిగింది. ఇప్పటికే ప్రజా సంఘాలతో పాటు వామపక్షాలు కూడా దీనిపై తీవ్ర స్థాయిలో నిరసన తెలుపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం రూ.2 పెంచడంతో పాటు గ్యాస్‌పై కూడా ధర పెంచింది. సామాన్యుడికి సంబంధించిన గ్యాస్ సిలిండర్ 14.02 కేజీల బరువు గల సిలిండర్‌పై అదనపు భారం పేద ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు వైఎస్ఆర్ సర్కార్ హయాంలో కేంద్రం భారం పెంచినా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలపై భారం పడకుండా ప్రభుత్వమే కొంత మేర భరించిన పరిస్థితులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెంచినా అందులో భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం పెదవి విప్పడం లేదు.

జిల్లాపై అదనపు భారం రూ.2.68 కోట్లు

అన్నమయ్య జిల్లాలో సుమారు 5.16 లక్షలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉండగా వారిపై ఒక్కొక్క సిలిండర్ సరాసరిన రూ.50 వేస్తుంటే దాదాపు రూ.2.68 కోట్ల మేర భారం పడనుంది. అంతేకాకుండా ఏడాదికి 3 సిలిండర్లు అనుకుంటే మొత్తం మీద సరాసరిన రూ.8 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది. ఉద్యోగులు, ఇతర ఉన్నత స్థాయి శ్రేణులు భరించినా సామాన్య జనాలతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలకు మాత్రం గ్యాస్ భారంగా పరిణమిస్తోంది. ఏది ఏమైనా గ్యాస్‌పై బరువు పేదల తలపై పిడుగులా పడింది.

గ్యాస్ సిలిండర్ ధర పెంచడం అమానుషం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి డిమాండ్



రాయచోటి : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచడం అమానుషమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో గ్యాస్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలకు అదనపు భారమైందని అభిప్రాయపడ్డారు. ఉజ్వల్ యోజన కింద అందజేసిన సిలిండర్‌పై కూడా రూ. 50లు భారాన్ని మోపారన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సామాన్యుడిపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు సిలిండర్ ధర పెంచడం భారంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం–2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు చాలా మందికి అందడం లేదన్నారు. తొలి విడత కింద ఇప్పటి వరకు ముప్పై, నలభై శాతం మందికి సిలిండర్ రాయితీ డబ్బులు వారి ఖాతాకు జమ కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

మన రాష్ట్రంలోనే ధరలు ఎక్కువ : పెట్రోల్, డీజిల్ ధరలు మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.109.22, కర్ణాటకలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.92, తమిళనాడులో లీటర్ పెట్రోల్ ధర రూ.101.84 ఉందన్నారు. అన్ని రాష్ట్రాల కన్నా డీజిల్, పెట్రోల్ ధరలు రూ.10 తగ్గి ఉండేలా చేస్తామని కూటమి పెద్దలు ఎన్నికల సమయంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

అన్నీ పెంచితే మేము ఎట్లా బతకాలి



ప్రభుత్వం పథకాలు ఈయకపోయా.. వస్తువుల రేట్లు పెరిగిపోయినాయి. కరెంటు చార్జీలు మాలాంటి పేదోళ్లు తట్టుకోలేనంతగా పెంచినారు. ఇప్పుడు గ్యాస్ ధర కూడా పెంచితే కూలి, నాలి చేసుకొని బతికేటోళ్లం మేము ఎట్లా బతకాలి. ఈ ప్రభుత్వంలో మాలాంటి వాళ్లు బతకడానికి భారంగా ఉంది. ప్రభుత్వం గ్యాస్‌తో సహా అన్ని ధరలను తగ్గించాలి.

– లలితమ్మ, రాజంపేట

పేదల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి సిలిండర్‌పై ధర పెంచమని రాష్ట్ర ప్రభుత్వం ఊదరగొట్టింది. ఇప్పుడేమో సిలిండర్‌పై రూ.50 పెంచి మా పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నది.

– బుక్కే ఈశ్వరమ్మ, గాలివీడు

కూలీలకు వెళ్లే మాలాంటి వారు బతికేదెట్లా



రోజువారిగా కూలి పనికి వెళ్లి కూలి చేసుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నాం. ఇప్పటికే గ్యాస్ కొనుక్కోవాలంటే అగచాట్లు పడుతున్నాం. మళ్లీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో మా లాంటి పేద వాళ్లకు చాలా కష్టం.

– కాటమ్మ, దేవపట్ల, సంబేపల్లె మండలం

తూతూ మంత్రంగా మున్సిపల్ గేట్ వసూలు వేలంపాట

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ పరిధిలో గేటు వసూలు నిమిత్తం జరిగిన వేలం పాటలు తూతూ మంత్రంగా సాగాయి. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో గేటు వసూలుకు, కూరగాయల మార్కెట్ గేటు వసూలుకు ఏకపక్షంగా జరిగిన వేలంపాటలో ఇరువురు వేలం పాటాదారులే పాల్గొనడం గమనార్హం. మార్కెట్ గేటు, టౌన్ గేటు వసూలును జీఎస్టీతో కలిపి మొత్తంగా రూ.10.1 లక్షలకే వేలంపాటదారులకు అప్పజెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన బడానేత ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు గేటు వేలం పాటను తక్కువకే నిర్ణయించడం ద్వారా మున్సిపల్ ఆదాయానికి భారీగా గండికొట్టారన్న విమర్శలు ఉన్నాయి.

రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ గేటుకు జరిగిన వేలం పాటలో రూ.3.20 లక్షలకు వై.రెహానా దక్కించుకున్నారు. ఈ మొత్తం జీఎస్టీతో కలిపి రూ.3,87,800 గా అధికారులు నిర్ణయించారు. టౌన్ గేటుకు సంబంధించి జరిగిన వేలంపాటలో ఎస్. జమీలున్ రూ.5.20 లక్షలకు దక్కించుకున్నారు. ఈ మొత్తం జీఎస్టీతో కలసి రూ. 6,14 లక్షలుగా తేల్చారు. మొత్తం రెండురకాల గేటువసూలు హక్కులు రూ.10 లక్షల వెయ్యి రూపాయలకు వేలం పాటదారులు దక్కించుకున్నారు. మున్సిపాలిటీకి ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెట్టే టౌన్, మార్కెట్‌గేట్‌ల వేలం హక్కులను తక్కువ మొత్తానికి వేలం పాటదారులు దక్కించుకోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది.

అద్భుతమైన సందేశ కావ్యం రామాయణం



ధార్మికోపన్యాసం చేస్తున్న గంగనపల్లి వెంకటరమణ

ఒంటిమిట్ట : సంస్కృతంలో ఆది కావ్యమైన రామాయణంలోని ప్రతి పాత్ర ఒక సమున్నతమైన సందేశాన్ని మానవజాతికి అందించిందని, అలాంటి అద్భుతమైన సందేశ కావ్యం రామాయణమని తిరుపతి–తిరుమల దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. ఒంటిమిట్ట కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజైన మంగళవారం ఉదయం ఆయన రామాయణంలోని తార, మండోదరీల మాటలు అనే అంశంపై ధార్మికోపన్యాసం చేశారు. కిష్కింధకాండలో కనిపించే తార పాత్ర తన భర్త అయిన వాలికి సుగ్రీవుడు శ్రీ రామచంద్రుల విషయంగా చెప్పిన నీతి బోధనలు ఎన్నటికీ శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్తు కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు ముమ్మిడి నారాయణ రెడ్డి, సిద్ద లింగారెడ్డి, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. పట్టాభిరాముడి కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం



మాంగళ్య ధారణకు ముందు తాళిబొట్టు చూపుతున్న వేద పండితులు

- గరుడవాహనంపై ఊరేగిన శ్రీరామచంద్రుడు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలికిరి(వాల్మీకిపురం) : వేదపండితుల మంత్రోచ్చాటన.. మంగళ వాయిద్యాల ఘోష.. పురోహితులు... వందిమాగధులు.. పరిచారకులు వెన్నంటి ఉండగా.. కల్యాణ వేదికపై పట్టు వస్త్రాలతో పెళ్లి కొడుకుగా ముస్తాబైన రామచంద్రుడు.. కుడివైపు పెళ్లి వస్త్రాలతో సిగ్గు లొలకబోస్తున్న సీతమ్మ తల్లి.. ఎడమ వైపు లక్ష్మణ స్వామి ఆశీనులయ్యారు. రంగు రంగుల పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదికపై సీతారాముల కల్యాణ వైభోగాన్ని వీక్షించిన భక్త జనం పరవశించి పోయారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి అభిషేకం, అర్చన, స్నపన తిరుమంజనం, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. టీటీడీ అధికారులు, ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మోసుకు వచ్చి అందజేయగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి భోగోత్సవమూర్తులైన శ్రీసీతారామలక్ష్మణులను విశేష రీతిలో అలంకరించి గరుడ వాహనంపై పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో కోలాటలు, చెక్కభజనలు, హరికథా కాలక్షేపాలు, లంకా దహనం, బాణసంచా, బళ్లారి వాయిద్యాలు, మహిళల చలిపిండి దీపారాధనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ శ్రీవల్లి, టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

చింతచెట్టు కోసిన ఐదుగురిపై కేసు నమోదు



చింత చెట్టును కోసివేసిన దృశ్యం

మదనపల్లె : పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, చింతచెట్టును కోసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని దేవళంవీధికి చెందిన వెంకటరమణ భార్య జగదీశ్వరికి తన తల్లి రామలక్ష్మమ్మ పేరుపై సర్వేనెం.144, 145లో 25 సెంట్ల పొలం ఉమ్మడి ఆస్తిగా ఉంది. ఈనెల 6న రామారావు కాలనీకి చెందిన మాదిన భాస్కర్, అతని భార్య మాదిన శాంతమ్మలు అంకిశెట్టిపల్లె మార్గంలో ఉన్న జగదీశ్వరి పొలంలోకి అక్రమంగా వెళ్లి అందులో ఉన్న రూ.లక్ష విలువచేసే చింతచెట్టును కోసివేశారు. జగదీశ్వరి కుటుంబసభ్యులు అక్కడకు వెళ్లి ప్రశ్నిస్తే..ఈ పొలం మీది కాదని, ఇంకా ఎక్కువ మాట్లాడితే..మీపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని వారిని బెదిరించి దౌర్జన్యం చేశారు. దీంతో జగదీశ్వరి సోమవారం సాయంత్రం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమేరకు మాదిని భాస్కర్, అతడి భార్య శాంతమ్మ, చింతచెట్టు కోసం దుకు వచ్చిన మరో ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి ఏరియా ఆస్పత్రిలో రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి ఏరియా ఆస్పత్రిలో నూతన ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలా మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో తమ తండ్రి మండిపల్లి నాగిరెడ్డి కూడా మృతి చెందారన్నారు. అలాంటి ప్రమాదాల్లో మరణాలు తగ్గించేందుకు ఈ క్రిటికల్ కేర్‌సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, ఆస్పత్రి కమిటి చైర్మన్ ఖాదర్ బాషా, సభ్యులు లయన్ మహమ్మద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

మదనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి అమలుచేసే వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు, ఇతర సహాయక కార్యక్రమాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలో మదనపల్లె డివిజన్‌లోని వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులందరికీ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలో 1,78,000 మంది పీఎం కిసాన్ యోజన లబ్ధిదారులు ఉంటే, అందులో 75శాతం మందికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తిచేశామన్నారు. 85శాతం పూర్తిచేస్తే కేంద్రప్రభుత్వం నుంచి రూ.170 కోట్లు బడ్జెట్ వచ్చే అవకాశం ఉన్నందున ఈనెల 15లోపు పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు తప్పనిసరిగా రైతుసేవా కేంద్రాలకు వెళ్లి తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్, ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకువెళ్లి 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శివశంకర్, ఏఓలు రమేష్‌రాజు, చంద్రశేఖర్, మురళీ, మోహన్, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీల్లో ఎలా నియమిస్తారు?

రౌండ్ టేబుల్ సమావేశంలో ఇండియా కూటమి పార్టీల నేతలు



వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

మదనపల్లె : ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డు కమిటీల్లో ఎలా నియమిస్తారు? ముస్లింల మత స్వేచ్ఛకు భంగం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే వెనక్కుతీసుకోండి అంటూ విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఇండియా కూటమి పార్టీల నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ, వీసీకే పార్టీ అధినేత డాక్టర్. తిరుమావళవన్, ఏప్రిల్ 8న నిరసన కార్యక్రమాలు చేపడతామని పార్లమెంటులో ప్రకటించిన నేపథ్యంలో... మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. వక్ఫ్ సవరణ చట్టం – దుష్పరిణామాలు అంశంపై, వీసీకే రాష్ట్ర ప్రచార కార్యదర్శి టి.ఎ. పీర్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డి సాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు, సీపీఐ నాయకులు తోపు కృష్ణప్ప, కోటూరి మురళి, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కోనేటి దివాకర్, న్యాయవాదులు సోమశేఖర్, సుహేల్, ముస్లిం ఐక్య వేదిక అధ్యక్షుడు ఫైజ్ అహ్మద్ తదితరులు ప్రసంగించారు.

పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదం పొందిన 2025 వక్ఫ్ (సవరణ) బిల్లు, జాతీయ ఐక్యతా స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. బిల్లు ముస్లిం సమాజం, మత స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే విధంగా రూపొందించబడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇతర మత సమాజాల ఆస్తుల విషయంలో జోక్యం చేసుకోనప్పుడు, వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో మాత్రం ఎందుకు ఈ దూకుడు చూపిస్తోందని ప్రశ్నించారు. ఈ సవరణలోని ఒక నిబంధన ప్రకారం, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించే అవకాశం కల్పించారని, దీన్ని బీజేపీ పరిపాలనా పారదర్శకత అని సమర్థించు కుంటోందని, కానీ ఇది ముస్లిం సమాజం స్వయం పరిపాలనా హక్కులపై దాడి తప్ప మరేమీ కాదని విమర్శించారు. ఈ చట్టం దేశ ప్రజల ఐక్యతను, సామరస్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. భారత జాతి ఐక్యతకు, స్వేచ్ఛకు, సౌభ్రాతృత్వానికి భంగం కలిగించే ఈ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడేందుకు అందరం ఏకమై, ఆందోళనలు ఉధృతం చేయాలన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో ముస్లింలు, ప్రగతిశీల శక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వీసీకే నేత శివప్రసాద్ కోరారు. బాస్ కోశాధికారి సీరుగట్టి రమణ, వీసీకే టౌన్ ప్రెసిడెంట్ బురుజు రెడ్డిప్రసాద్, బాస్ టౌన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్ పఠాన్, స్థానిక నాయకులు చాట్ల బయన్న, సొన్నికంటి రెడ్డెప్ప, జి.వి. రమణ, గంగాధర్, ముస్లిం ప్రతినిధులు మన్సూర్, షాహిద్ బేగ్, ఇలియాజ్, రోషన్, అష్రఫ్ తదితరుల తోపాటు పెద్ద సంఖ్యలో ముస్లిం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో చోరీ

- వారం తర్వాత గుర్తించిన బాధితులు
- 80 గ్రాముల బంగారు అపహరించిన దొంగలు

మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో చోరీ జరిగింది. బాధితులు వారం తర్వాత చోరీని గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎర్రిస్వామి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. మార్చి 31న భార్యతో కలిసి అరుణాచలం వెళ్లారు. దైవదర్శనం అనంతరం భార్య అనారోగ్యానికి గురికావడంతో అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొంది సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. తలుపులు తాళాలు పగలగొట్టి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో తనిఖీ చేసి 80 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు నిర్ధారించుకున్నారు. టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతి తీరని లోటు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంతాప సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : విధులపట్ల ఎంతో నిబద్ధత కలిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాను కోల్పోవడం జిల్లాకు తీరని లోటని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజీఆర్ఎస్ హాల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి అధికారిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆమె నిబద్ధత గురించి సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చెప్పడంతోనే పీజీఆర్ఎస్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈమె నియామకం తరువాత పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అన్నమయ్య జిల్లా ఎంతో వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన వ్యక్తి రమ అన్నారు. ఆమె ఎంతో మృదు స్వభావి, నిజాయితీగల అధికారిణి అని కొనియాడారు. సమావేశంలో డీఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ సహదేవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు : మండలంలోని వనిపెంట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.శ్రీకాంత్ (22) అనే యువకుడు మృతి చెందాడు. బ్రహ్మంగారిమఠంలోని తెలుగు గంగ కాలనీకి చెందిన శ్రీకాంత్ మోటార్ బైక్‌పై మైదుకూరు వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలతో ఉన్న అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బైక్‌పై వస్తున్న యువకుడిని కారు ఢీకొన్నట్టు పలువురు తెలిపారు. అయితే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని నిలపకుండా వెళ్లినట్టు చెబుతున్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.